# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 68 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 7 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 68, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 7 జూలై 2023 పేజీలు : 4 వెల : 5/-



### తెలంగాణలో మరో 14,565 ఇంజినీరింగ్ సీట్లకు

## రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో మరో 14,565 ఇంజినీరింగ్ సీట్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోర్ గ్రూపుల్లో సీట్లు వెనక్కి ఇస్తామని పేర్కొంటూ ఇంజినీరింగ్ కాలేజీలు కంప్యూటర్ కోర్సుల్లో సీట్లకు అనుమతి కోరాయి. దీంతో 6,930 సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాగే కొత్తగా 7,635 ఇంజినీరింగ్ సీట్లకు ప్రభుత్వం అనుమతి ఖరారు చేసింది. ఫలితంగా అదనపు సీట్లతో ఏటా సర్కారు పై రూ. 27.39 కోట్ల భారం పడ నుంది. ఇటీవల 86,106 ఇంజినీరింగ్ సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, తాజాగా అను మతిచ్చిన వాటితో కలిపి రాష్ట్రంలో ఇంజి నీరింగ్ సీట్ల సంఖ్య 1,00,671కి చేరింది.

# తెలంగాణ బీజేపీలో... ఏం జరుగుతోంది..!



- మార్పులతో తెలంగాణ బీజేపీకి నష్టమా..?లాభమా..?
- బండి సంజయ్‌ను మార్చడం ఎందుకున్నది ఢిల్లీ పెద్దల ఆలోచన
- అంతర్గత కుమ్ములాటలకు చెక్ పెట్టేందుకు ఢిల్లీ పెద్దల ప్రయత్నం

తెలంగాణలో మరో నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో బీజేపీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. అధికార బీఆర్ఎస్ పార్టీని దీటుగా ఎదుర్కొనే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పదవి నుంచి దిగిపోయారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పార్టీ హైకమాండ్ నియమించింది. అయితే, అంతా సరిగ్గా ఉన్న టైంలో అసలేందుకు ఈ మార్పు..? దీనివల్ల తెలంగాణ బీజేపీకి నష్టమా..?లాభమా..? ఆ వివరాలపై ఓ లుక్కేయండి.2019 లోక్ సభ ఎన్నికలు అయ్యాక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ నియమితులయ్యారు. కరీంనగర్ ఎంపీగా విజయం సాధించిన అప్పటి నుంచి ఆయనది ఒకటే మంత్రం. సీఎం కేసీఆర్ పై దూకుడు. కేసీఆర్ మాటలకు.. మాటలతోనే తిప్పికొట్టాలనే ఫార్ములానా బాగా ఒంట పట్టించుకున్నారు. ఈయన హయాంలోనే దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు వంటి ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. మునుగోడులో ఓడిపోయినప్పటికీ బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం బీజేపీ అన్న ఫీలింగ్ తెప్పించింది. ఇక హైదరాబాద్ ఉఊఓఅ ఎన్నికల్లోనూ బీజేపీ సత్తా చాటింది. పాదయాత్రతో బండి సంజయ్ బీజేపీని గ్రామాల్లోకి తీసుకెళ్లారు.

మిగతా 2లో...

## నడ్డాతో పురందరేశ్వరి భేటీ



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలిగా నియమితులైన దగ్గుబాటి పురందేశ్వరి .. తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఢిల్లీలో సమావేశం అయ్యారు. పార్టీ అధ్యక్షురాలిగా నియమించిన సమయంలో ఆమె అమరనాథ్ యాత్రలో ఉన్నారు. యాత్ర ముగించుకుని ఢిల్లీకి వచ్చిన తర్వాత జేపీ నడ్డాతో సమావేశం అయ్యారు. ఏపీలో బీజేపీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తామని పురందేశ్వరి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం , ఏపీ ప్రజల ప్రయోజనాల కోసమూ కృషి చేస్తామన్నారు. దగ్గుబాటి పురందేశ్వరి ఇప్పటి వరకూ రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా జోక్యం చేసుకోలేదు. కాంగ్రెస్ పార్టీ హయాంలో పదేళ్లు కేంద్ర మంత్రిగా చేశారు. ఆ తర్వాత బీజేపీలో చేరిన జాతీయ స్థాయి పదవుల్లోనే పని చేశారు. అయితే ఆమెను తొలి సారిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిలో నియమించారు. దేశంలో బీజేపీ అత్యంత బలహీనంగా ఉన్నది

మిగతా 2లో...

## 13న చంద్రయాన్-3 ప్రారంభం



బెంగళూరు- ప్రభాత సూర్యుడు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) తన చంద్రయాన్-3 మిషన్‌ను జూలై 13న ప్రారంభించనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట స్పేస్ సెంటర్ నుంచి ఈ విషన్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించనున్నారు. చంద్రయాన్-3 మిషన్‌లోని వ్యోమనౌక 2 నెలల సుదీర్ఘ


మిగతా 2లో...

### ఏపీ తెలంగాణ

## హైకోర్టులకు కొత్త సీజేలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలుగు రాష్ట్రాల హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులను కొలీజియం సిఫార్సు చేసింది. బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సజెస్ట్ చేసింది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరధేను తెలంగాణ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సూచించింది. దీనికి రాష్ట్రపతి ఆమోద ముద్రవేయాల్సి ఉంది. వివిధ రాష్ట్రాల హైకోర్టులు, సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల భర్తీపై కొలీజియం సమావేశమైంది. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఖాళీలపై ఫోకస్ పెట్టింది.



తెలుగు రాష్ట్రాలతోపాటు ఏడు రాష్ట్రాల హైకోర్టులకు

మిగతా 2లో...

### దేశంలోనే పేద పార్టీ

## కాంగ్రెస్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఈ దేశంలో అత్యంత పేద పార్టీ కాంగ్రెస్ పార్టీ అని..ప్రస్తుతం ఏ రకమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నామో అర్థం చేసుకోవాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు రాజకీయ పార్టీలను దాటి.. ఏజెన్సీలు వచ్చాయని, ఈ రకం ఏజెన్సీలను నియమించుకోవడం చాలా ఖర్చుతో కూడుకున్నదని రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం

మిగతా 3లో...

## అచ్చాదిన్ ఎక్కడా...



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగాల ఖాళీలపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గురువారం ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు కొత్త శిఖరాన్ని తాకాయని పేర్కొన్నారు. 2014 నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు 11 శాతం ఉండగా.. 2004లో 'భారత్ వెలిగిపోతున్న' సమయంలో సెంట్రల్ గర్నమెంట్‌లో ఖాళీలు 12.1శాతం ఉంటే.. ఇప్పుడు కేంద్రంలో ఖాళీలు 25 శాతానికి చేరాయని విమర్శించారు. ఈ సందర్భంగా గణాంకాలతో ట్వీట్ చేశారు. హోంమంత్రిత్వశాఖలో 11.1శాతం, రైల్వేలో 20.5శాతం, డిఫెన్స్ సివిలియన్ 40.2 శాతం, రెవెన్యూలో 41.6శాతంతో పాటు తదితర విభాగాల్లో ఖాళీలున్నాయని

మిగతా 2లో...

## జగన్‌ను కలిసిన పొంగులేటీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాడేపల్లిలో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ఆయన ఏ అంశంపై కలిశారన్న దానిపై స్పష్టత లేదు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీఎం జగన్ కు సన్నిహితునిగా పేరు ఉంది. ఆయన రాజకీయ రంగ ప్రవేశం వైఎస్ఆర్‌సీపీ ద్వారానే జరిగింది. ఆ పార్టీ తరపున మొదట ఖమ్మం ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అయితే అక్కడ ప్రాధాన్యం దక్కక పోవడంతో ఇటీవల రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనూహ్యంగా ఇప్పుడు జగన్ ను కలిసేందుకు తాడేపల్లికి రావడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది.పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీతో పాటు ఆయన కుటుంబానికి చెందిన పలు కంపెనీలు ఏపీలో కాంట్రాక్టులు పొందాయి. కడపలో వరదల ధాటికి కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణ కాంట్రాక్ట్ కూడా పొంగులేటి కంపెనీకే దక్కింది. రూ.660 కోట్లతో టెండర్ ఖరారైంది. గత నెలలోనే అధికారులు రివర్స్ టెండరింగ్ ద్వారా ప్రాజెక్టు అంచనా వ్యయం కంటే... ఎక్కువ ధరకు టెండర్‌ను ఖరారు చేశారు. త్వరగానే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మైనింగ్ శాఖ? సీవరేజీ వసూలును ప్రైవేటు సంస్థలకు ఇవ్వా లని

మిగతా 2లో...

### ప్రధాని టూరుకు

## కేసీఆర్ వస్తారా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 8న తెలంగాణలో పర్యటించనున్నారు. ఆయనది రాజకీయ పర్యటన కాదు. అధికారిక పర్యటనే. ఈ సందర్భంగా వరంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభం, శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం వరంగల్‌లో నిర్వహించనున్న సభలో

మిగతా 2లో...

## నడ్డాతో పురందరేశ్వరి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఏపీలోనే. ఒక్క శాతం ఓటు బ్యాంక్ కూడా లేదు. గత తొమ్మిదేళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ..బలహీనంగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో బలోపేతం అయినప్పటికీ ఏపీలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. ఎంత మంది నేతల్ని మార్చినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. దీంతో బీజేపీ హైకమాండ్ పురందేశ్వరి వైపు మొగ్గు చూపింది. ఇక ముందు పెద్ద ఎత్తున కార్యక్రమాలు పేట్టాలనే ఆలోచనలో బీజేపీ ఉంది. పురందేశ్వరి ఒకటి, రెండు రోజుల్లో ఏపీకి రానున్నారు. ఈ సందర్భంగా భారీ కార్యక్రమాలు చేపట్టాలనే ఆలోచన చేస్తున్నారు. గతంలో బీజేపీ అమరావతికి మద్దతు ఇచ్చినా అక్కడి రైతులు నమ్మలేకపోయారు. అలాగే పలు అంశాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినా .. ప్రజలు బీజేపీ, వైసీపీ ఒక్కటే అన్న అభిప్రాయం వ్యక్తం చేసేవారు. కానీ ఇప్పుడు మాత్రం పురందేశ్వరి నాయకత్వంలో అలాంటి ముద్ర వేయడానికి అవకాశం ఉండదని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, ప్రజా చార్జి,షీట్ వంటి కార్యక్రమాలు నిర్వహించింది. అయితే ప్రో వైసీపీ ముద్ర ఉండటంతో పెద్దగా ప్రజల్లోకి వెళ్లలేదు. ఇప్పుడు పురందేశ్వరి నాయకత్వంలో మరింత జోరుగా ప్రజల్లోకి వెళ్లే ఆలోచన చేయాలనుకుంటున్నారు. దీనిపై కార్యాచరణ త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.

## 13న చంద్రయాన్-3 ప్రారంభం

ప్రయాణం చేసి చంద్రుడిపై ల్యాండ్ అవుతుంది. ఇస్రో ఇంతకు ముందు కూడా చంద్రుడిపై అడుగుపెట్టింది. 2008 అక్టోబర్‌లో చంద్రయాన్-1 మిషన్ ద్వారా భారత్ చంద్రుడిపై మొదటి సారిగా అడుగుపెట్టింది. ఇంకా ఆ మిషన్ ద్వారా చంద్రుడిపై ఒకప్పుడు నీరు ఉన్నట్లుగా ఆనవాళ్లను భారత్ గుర్తించింది. అయితే చంద్రుడిపై దిగడం చాలా సవాళ్లతో కూడుకున్న మిషన్. చంద్రయాన్-2 మిషన్ పేరుతో 2019లో ఇస్రో చేపట్టిన విఫలమైన సంగతి తెలిసిందే. అప్పుడు చంద్రయాన్ ల్యాండర్, రోవర్ రెండూ క్రాష్ అయిన సంగతి తెలిసిందే.నిజానికి చంద్రునిపై లేదా అంతరిక్షంలోని వేరే గ్రహంపై ల్యాండింగ్ చేయడానికి చాలా విషయాలపై కలిసి పనిచేయాలి. నావిగేషన్, ఫ్లైట్ డైనమిక్స్, లోడింగ్ సైట్ క్లియర్ ఇమేజ్, లోడ్ అయ్యే ముందు సరైన సమయంలో స్పేస్‌క్రాఫ్ట్ తగ్గడం వంటి ఎన్నో విషయాలు మిషన్‌ని ప్రభావితం చేస్తాయి.ఇంకా వ్యోమనౌక ఉపరితలం వైపు కదులుతూ విడిపోయినప్పుడు దానిపై ఉన్న ల్యాండర్ వేగాన్ని తగ్గించడం చాలా అవసరం. వేగాన్ని సెకనుకు మూడు మీటర్లకు తగ్గించకపోతే, లాడింగ్ కూడా విఫలం కావచ్చు.ఇవే కాక చంద్రునిపై వాతావరణం , భూమిపై లాంటి గురుత్వాకర్షణ శక్తి లేని నేపథ్యంలో.. లోడ్ చేసే సమయంలోనే అంతరిక్ష నౌక వేగం, గురుత్వాకర్షణను చాలా బాగా కాల్క్యులేట్ చేసుకోవాలి. పైగా చంద్రునిపై పెద్ద క్రేటర్స్ కూడా ఉన్నందున ల్యాండింగ్ కోసం సరైన ఉపరితలాన్ని గుర్తించడం చాలా చాలా అవసరం. సరైన ల్యాండింగ్ పాయింట్‌ని ఎంచుకోబడకపోతే, అంతరిక్ష నౌక క్రాష్ అయ్యే ప్రమాదం ఉంది.

## అచ్చాదిన్ ఎక్కడా...

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు.కేటీఆర్ చేసిన ట్వీట్‌లో వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఘోరంగా ఓడిపోతుందనే అర్థం ఉంది. 2004 ఎన్నికల సమయంలో ప్రధానమంత్రి వాజ్ పేయి ఉండేవారు. ఆ సమయంలో ఎన్నికలకు వెళ్లే ముందు బీజేపీ భారత్ వెలిగిపోతోంది అన్న అర్థంతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అయితే ఆ ప్రచారం రివర్స్ అయింది. ప్రజలు బీజేపీని ఆదరించలేదు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చింది. అప్పట్నుంచి పదేళ్ల పాటు అధికారంలో ఉంది. ఇప్పుడు కూడా బీజేపీ అచ్చేదిన్ అనే ప్రచారం చేసుకుంటోంది. ఈ అక్రమంలో అప్పటి కన్నా ఇప్పుడు ఇంకా ఎక్కువ ఖాళీగా ఉన్నాయని.. ఖాళీ అవుతున్నప్రతి నాలుగు ఉద్యోగాల్లో మూడు మాత్రమే భర్తీ చేస్తున్నారని.. మరొకదాన్ని ఖాళీగా ఉంచుతున్నారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పది లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తోంది. వరుసగా ప్రధానమంత్రినరేంద్రమోదీ స్వయంగా ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చే రోజ్ గార్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మిషన్ మోడ్ లో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. అయితే విపక్షాలు మాత్రం పెద్ద ఎత్తున ఖాళీలు ఉంటే అతి తక్కువ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. బీజేపీ విషయంలో విమర్శలను తగ్గించుకున్నట్లుగా కనిపించిన కేటీఆర్ .. తరచూ కేంద్రంపై ఇలాంటి ట్వీట్లు చేస్తూనే ఉన్నారు. రెండు పార్టీల మధ్య ఓ అవగాహన ఉందన్న ప్రచారం తెలంగాణ రాజకీయవర్గాల్లో సాగుతోంది. ఇది బీఆర్ఎస్ కు కూడా ఇబ్బందికరమే కాబట్టి.. కేటీఆర్ మళ్లీ కేంద్రంపై విమర్శలు పెంచుతున్నట్లుగా చెబుతున్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలనే కేటీఆర్ ప్రశ్నిస్తారని.. రాజకీయ పరంగా ఎలాంటి విమర్శలు చేరన్న వాదన వినిపిస్తోంది.

# తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

అయితే మె?త్తం ఫేమ్ ఆయనకే వస్తుంది. పార్టీలో చేరిన తమకు ప్రాధాన్యత దక్కట్లేదు అన్నది మిగతా లీడర్ల ఆరోపణలు. అందుకే.. పార్టీ ప్రెసిడెంట్ గా కొత్త వాళ్లను పెట్టాలని కొందరు నేతలు డిమాండ్ చేశారని తెలుస్తోంది. బండి సంజయ్ సారథ్యంలో బీజేపీ మంచి ఫలితాలు సాధించింది. ఆయనను మార్చడం ఎందుకున్నది ఢిల్లీ పెద్దల ఆలోచన. కానీ, బీజేపీలోకి వలస వచ్చిన నేతలు మాత్రం తమకు ప్రాధాన్యత కోసం బండి సంజయ్ ను దింపాల్సిందేనని పట్టుపట్టారు. దీంతో ఏం చేయాలో తోచక బీజేపీ అగ్రనాయకత్వం పార్టీ అధ్యక్షుడు మార్పునకు ఒకే చెప్పిందికానీ ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. బండి సంజయ్ ప్లేస్ లో ఎవరిని ఎంపిక చేయాలి..? ఎందుకంటే ఆ పదవి కోసం చాలా మంది పోటీపడుతున్నారు. ప్రధానంగా టీఆర్ఎస్ నుంచి వచ్చిన నేత, మాజీ మంత్రి ఈటల రాజేందర్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావుల మధ్య పోటీ ఉంది. ఈ సమయంలో ఒకరికి పదవి ఇస్తే.. ఇంకోకరి హర్ట్ అవుతారని భావించిన ఢిల్లీ పెద్దలు అడక్కపోయినప్పటికీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవికి కట్టబెట్టారు. ఎందుకంటే ఆయన పార్టీలో సీనియర్, అందరితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో లీడర్లను సమన్వయ పరచుకోవడంలో ఆయన దిట్ట. అందుకే పదవి కోసం పోటీ పడిన వాళ్లను పక్కన పెట్టి.. పార్టీలో అందరివాడుగా కలుపుగోలుగా ఉండే కిషన్ రెడ్డికి అవకాశం ఇచ్చారు.అదే సమయంలో ఈటల రాజేందర్ అసంతృప్తిని చల్లార్చేందుకు.. ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఇచ్చారు. ఇక ఎన్నికల బాధ్యత ఈటల రాజేందర్ ని అన్న కోణంలో ఆయనకు ఈ పదవి ఇచ్చారు. దీంతో ఆయనతో పాటు ఆయన అనుచరులు కూల్ అవుతారని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. కానీ, రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్న రఘునందన్ రావుకు ఎలాంటి పదవి ఇవ్వలేదు. సో.. ఇప్పుడు రఘునందన్ రావు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అన్నది ప్రశ్నార్థకంగా మారింది.ఓ వైపు కాంగ్రెస్ జోరు పెరుగుతున్న సమయంలో బీజేపీలో అంతర్గత కుమ్ములాటలకు చెక్ పెట్టేందుకు ఢిల్లీ పెద్దలు ఈ ప్రయత్నం చేశారు. మరి రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతోనైనా బీజేపీలో ముసలం చల్లబడుతుందా..? లేదా సరికొత్త చిక్కులు వస్తాయా..? అన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠగా మారింది

**జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కోమటిరెడ్డి**

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యునిగా నియమిస్తూ.. బీజేపీ హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. కీలకమైన పదవులకు మంగళవారం నియామకాలు చేశారు. ఆ సమయంలో ఏపీ నుంచి కిరణ్ కుమార్ రెడ్డికి జాతీయ కార్యవర్గ సభ్యునిగా పదవి ఇచ్చారు. అయితే అప్పుడు రాజగోపాల్ రెడ్డికి పదవి గురించి ఆలోచించలేదు. ఈ నియామకాల ప్రకటన వెలువడిన తర్వాత ... రాజగోపాల్ రెడ్డి అసంతృప్తికి గురయ్యారు. కాంగ్రెస్ లో చేరిన పొంగులేటితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మారుతారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ లోపే ఆయనకు బీజేపీ హైకమాండ్ జాతీయ స్థాయిలో ప్రాధాన్యమున్న పదవిని ప్రకటించారు రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు. ఆయన ఇటీవల బీజేపీలో చేరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఉపఎన్నికల్లో మళ్లీ తన స్థానం మునుగోడు నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో పరాజయం పాలయ్యారు. రేవంత్ రెడ్డిని టీ పీసీసీ చీఫ్‌ను చేయడాన్ని రాజగోపాల్ రెడ్డి వ్యతిరేకించారు. ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంపీ. ఆయన కూడా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించారు. అయితే మొదట ఉపఎన్నిక వ్యూహంలో భాగంగా రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరారు. తర్వాత వెంకటరెడ్డి కూడా చేరుతారని అనుకున్నారు. కానీ కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత మొత్తం సీన్ మారిపోయింది. కేసీఆర్ ను ఓడించే పార్టీ బీజేపీ మాత్రమేనని ప్రకటనలు చేస్తూ వచ్చిన రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు బీజేపీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కవితను అరెస్ట్ చేయకపోవడం ఢిల్లీ లిక్కర్ స్కాంలో తదుపరి చర్యలు తీసుకోకపోవడం.. బీఆర్ఎస్ నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని రాజగోపాల్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే ఆయన కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆయన సోదరుడు వెంకటరెడ్డి కూడా.. రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ లోకి వస్తారని చెబుతున్నారు. ఇవాళ కాకపోతే.. రేపైనా రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ లో చేరుతారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే ఇప్పుడు బీజేపీ నాయకత్వం ఆయన పార్టీ మారకుండా చూసేందుకు పదవుల్లోనూ ప్రాధాన్యం ఇస్తామని చెప్పేందుకు ప్రత్యేకంగా జాతీయ కార్యవర్గ సభ్యునిగా నియమించారు. దీంతో ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి ఎలాస్పందిస్తారన్నది ఆసక్తికరంగామారింది.

### ఏపీ తెలంగాణ

# హైకోర్టులకు కొత్త సీజేలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తులను ఎంపిక చేసి కేంద్రానికి సిఫార్సు చేసింది. ఇందులో ఏపీ, తెలంగాణ, బొంబాయి, గుజరాత్, ఒడిశా, కేరళ రాష్ట్రాలు ఉన్నాయి.ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ పీకే మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్లడంతో ఖాళీ ఏర్పడింది. దీనికి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను నియమించాలని కొలీజియం సూచించింది. తెలంగాణకు కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరధేను సిఫార్సు చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈయన 2018 నుంచి కర్ణాటక హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. ఏపీ, తెలంగాణకు నియమించినట్టుగానే గుజరాత్‌కు సునీతా అగర్వాల్ అనే మహిళాన్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేశారు. బొంబాయి హైకోర్టుకు జస్టిస్ దేవేంద్రకుమార్, మణిపూర్‌కు జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్, కేరళకు జస్టిస్ ఆశిష్ దేశాయ్, ఒడిశాకు జస్టిస్ సుబాసిస్ తలపత్రను ప్రధాన న్యాయమూర్తులుగా నియించాలని కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న మూడు ప్రధాన న్యాయమూర్తుల నియామక ప్రక్రియను కూడా కొలీజియం చేపట్టింది. సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తులకు బదులు ప్రస్తుతం 31 మంది ఉన్నారు. ఇప్పుడు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి ఇద్దరు న్యాయమూర్తులను కొలీజియం సూచించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఉజ్జల్ భూయాన్, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్‌ను కొలీజియం పరిగణలోకి తీసుకుంది. జస్టిస్ ఉజ్జల్ భూయాన్ 2022 జూన్ 28 నుంచి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్ గతంలో ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేశారు. 2013 ఏప్రిల్ 12 నుంచి 2019 మార్చి వరకు సేవలు అందించారు. అప్పుడే కేరళకు బదిలీ అయ్యారు. అయితే 2023 జూన్ 1 నుంచి కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు.జస్టిస్ వెంకటనారాయణ భట్ నియామకం పూర్తైతే ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్న న్యాయమూర్తుల్లో ముగ్గురు తెలుగువారు ఉన్నట్టు లెక్క. ప్రస్తుతం జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ సేవలు అందిస్తున్నారు. కొలీజియం సూచించిన పేర్లకు రాష్ట్రపతి ఆమోద ముద్రవేస్తే వీళ్లందరికీ పదోన్నతి లభిస్తుంది.

# జగన్‌ను కలిసిన పొంగులేట

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించింది. రెండు, మూ?డు జిల్లాల్లో సీవరేజీ వసూలు చేసే కాంట్రాక్టులు కూడా పొంగులేటి కుటుంబానికి చెందిన కంపెనీలకే దక్కాయి. అలాగే ఏపీలో త్వరలోనే వ్యవసాయ మోటార్లు, నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించనున్నారు. ఇందుకు కోసం దక్షిణ, మధ్య డిస్కమ్‌లలో టెండర్లను ఖరారుచేశారు. రూ.4,592 కోట్ల విలువైన టెండర్లను రాఘవ కన్‌స్ట్రక్షన్స్, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీలకు అప్పగించినట్లుగా తెలుస్తోంది. ఇందులో ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన రూ.2056.95 కోట్ల విలువైన పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు దక్కినట్లుగా తెలుస్తోంది. ఉత్తరాంధ్రలోనూ రాఘవ కన్ స్ట్రక్షన్స్ కొన్ని ప్రాజెక్టుల కాంట్రాక్టులు పొందింది. ఈ క్రమంలో సీఎం జగన్ మోహన్ రెడ్డితో పొంగులేటికి దగ్గర సంబంధాలు ఉన్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల షర్మిల చేరుతారన్న ప్రచారం ఎక్కువగా ఉంది. ఆమె తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తారని అంటున్నారు. అయితే ఆమె ఏపీలో రాజకీయాలు చేస్తేనే కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసుకోవాలని తెలంగాణ నేతలు పార్టీ హైకమాండ్ పై ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో షర్మిల పార్టీ విషయంపైనా పొంగులేటి జగన్‌తో చర్చించి ఉంటారని భావిస్తున్నారు.

## దేశంలోనే పేద పార్టీ కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టేందుకు సిద్ధమయ్యాయని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లను మనం జన బలంతో కొట్టాలని రేవంత్ రెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు జిల్లా కమిటీలను రెండు రోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు. జులై 25లోగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని కమిటీలు పూర్తి చేస్తామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను అధికార పార్టీ తమ పార్టీకి అనుకూలంగా పని చేయించుకుంటోందని చెప్పారు. ఇది ఒక రకంగా అధికార దుర్వినియోగం లాంటిదని అన్నారు. గ్రామ స్థాయిలోనే కాంగ్రెస్ అనుకూల, వ్యతిరేక ఓట్లను గుర్తించాలని చెప్పారు. గతంలో గ్రామ పెద్ద ఏపార్టీకి లేదా గుర్తుకు ఓటు వేయమని చెబితే ఆ గుర్తుకు గ్రామ ప్రజలు ఓటు వేసేవారని, కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని అన్నారు. ఎన్నికల్లో వచ్చిన మార్పులు, సాంకేతికతను బీజేపీ, బీఆర్ఎస్ లు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. దీన్ని కాంగ్రెస్ అధిగమించాలని చెప్పారు. ఆగస్టు 18న హైదరాబాద్ మండల అధ్యక్షులకు ట్రైనింగ్ కార్యక్రమం ఉంటుందని రేవంత్ రెడ్డి వెల్లడించారు.ధరణి పోర్టల్‌లో జరుగుతున్న అక్రమాలను గురించి రేవంత్ రెడ్డి వివరించారు. ధరణి పేరుతో కేసీఆర్ కుటుంబం దోచుకుంటోందని, రాత్రిపూట ధరణి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని అన్నారు. ధరణి దోపిడీలో శ్రీధర్‌రాజు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే తాను ధరణి పోర్టల్ ఫెయిల్యూర్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తానని చెప్పారు. ధరణిలో జరిగిన అక్రమాలను జులై 15 తర్వాత బయటపెడతామని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేసి అంతకంటే మెరుగైన పోర్టల్‌ను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ భూ అక్రమాలను కూడా బయటపెడతామని అన్నారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న సంస్థలో పెట్టుబడి పెట్టిన వారు ఆర్థిక నేరగాళ్లు. ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న వారిలో విదేశీయులు ఉన్నారని, ఈ పోర్టల్ ద్వారా మన డీటైల్స్ అన్నీ విదేశీయుల చేతుల్లోకి వెళ్తున్నాయని అన్నారు. అనేక చేతులు మారి చివరకు.. ధరణి పోర్టల్ బ్రిటిష్ ఐల్యాండ్ చేతికి వెళ్లిందని అన్నారు. ధరణిలోని లోటుపాట్లను ఆసరాగా తీసుకొని నిషేధిత జాబితాలోని భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూములను అనుచరులకు రిజిస్ట్రేషన్ చేసి వెంటనే ప్రొహిబిషన్ లాక్ చేస్తున్నారని, ధరణి పోర్టల్ మొత్తం కేటీఆర్ మిత్రుడు శ్రీధర్ గాదె చేతిలో ఉందని అన్నారు.

## ప్రధాని టూరుకు కేసీఆర్ వస్తారా

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం లభిస్తుంది. ఇప్పుడు కూడా కేసీఆర్‌కు అలాంటి ఆహ్వానం వచ్చింది. అయితే కేసీఆర్ హాజరవుతారా లేదా అన్న సస్పెన్స్ మాత్రం కొనసాగుతోంది. ఇంకా ఎలాంటి ప్రకటనా ప్రభుత్వ వైపు నుంచి రాలేదు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన షెడ్యూల్ లో రైల్వేశాఖ ఆధ్వర్యంలో కాజీపేటలో ఏర్పాటు చేయనున్న వేగన్ ఓవర్ హాలింగ్ సెంటర్ కు శంకుస్థాపన ఉంది. అనంతరం వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్క్ కు శంకుస్థాపన చేస్తారు. 200 ఎకరాల్లో రూ. 10 వేల కోట్లతో టెక్స్ టైల్ పార్కును కేంద్ర ప్రభుత్వం నిర్మించబోతోంది. ఆ తర్వాత హన్మకొండలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసే బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తారు. ప్రధాని మోదీ పాల్గొనేవన్నీ అధికారిక పర్యటనలే. ప్రధాని మోదీ అధికారిక కార్యక్రమాల కోసం ఏ రాష్ట్రానికి వెళ్లిన అక్కడి సీఎంలు పాల్గొంటారు. బీజేపీ విధానాలపై ఎంత తీవ్రంగా వ్యతిరేకించినా.. మోదీ పై విమర్శలు చేసినా సరే .. బెంగాల్ సీఎం మమతా బెనర్జీ , తమిళనాడు సీఎం స్టాలిన్, కేరళ సీఎం విజయన్ వంటి వారు ప్రధాని వస్తే ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం పలుకుతారు. కానీ సీఎం కేసీఆర్ మాత్రం ఇష్టపడలేదు. గతంలో చినజీయర్ ఆశ్రమంలో సమతా విగ్రహాన్ని ప్రారంభించడానికి వచ్చినప్పుడు కానీ.. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని జాతికి అంకితం చేయడానికి వచ్చినప్పుడు కానీ ఆయన స్వాగతం చెప్పలేదు. సీనియర్ మంత్రి తలసానికి ఆ బాధ్యతలిచ్చారు. ఈ అంశంపై రాజకీయ దుమారం కూడా రేగింది. సీఎంను ఆహ్వానించలేదని ఓ సారి బీఆర్ఎస్ మంత్రులు విమర్శించారు..కానీ ఆహ్వానం పంపామని కేంద్ర మంత్రులు ఖండించారు. తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది కానీ..ప్రధాని మోదీ పర్యటన ఎప్పుడు ఉన్నా .. తెరపైకి వస్తూనే ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. బీజేపీపై కేసీఆర్ యుద్ధం దాదాపుగా ఆపేశారు. విమర్శలు కూడా చేయడం లేదు. తప్పని సరి సందర్భం వస్తే.. కాంగ్రెస్, బీజేపీ రెండింటిని విమర్శిస్తున్నారు. బయటకు చెప్పకపోయినా రెండు పార్టీల మధ్య యుద్ధ వాతావరణం మాత్రం లేదని.. తేలిక పడిందని అందరికీ స్పష్టత వచ్చింది. కేటీఆర్ ఢిల్లీ వెళ్లి పలువురు కేంద్ర మంత్రుల్ని కూడా కలిసి వచ్చారు. ఇలాంటి సమయంలో ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు వస్తే ఆయనకు కేసీఆర్ స్వాగతం చెప్పే అవకాశం ఉందన్నది ఎక్కువ మంది అంచనా వేస్తున్న విషయం. అయితే ఇలా ఆహ్వానం చెబితే రెండు పార్టీల మధ్య అవగాహన నిజమేనని ఎక్కువ ప్రచారం జరుగుతుంది. ఎందుకంటే గతంలో కేసీఆర్ ఆహ్వానించలేదు..ఇప్పుడెందుకు ఆహ్వానించారని ప్రశ్నించేవారు ఉంటారు. పర్యటనలో కేసీఆర్ పాల్గొంటారా లేదా అన్నది శుక్రవారంలోపు స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## సంపాదకీయం

# నయా బీజేపీ... విస్తరణే లక్ష్యం

2023లో ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలతోపాటు 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ అధినాయకత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రాల అధ్యక్షులను మార్చడంతోపాటు వివిధ కీలకమై పదవుల్లో సీనియర్లను నియమించింది. ఈ క్రమంలోనే కొన్ని స్పష్టమైన సంకేతాలు పంపించింది. బీజేపీ అంటే ఆర్ఎస్ఎస్ డామినేషన్. డైరెక్ట్‌గా ఇండైరెక్ట్‌గా వారి సూచనలు పార్టీ నేతలు తప్పక పాటిస్తారనే టాక్ ఉంది. బీజేపీకి ఆర్ఎస్ఎస్ బ్యాక్‌బోన్‌లా ఉంటుందని కూడా అంటారు. అందుకే వేరే పార్టీల నుంచి వెళ్లిన వారికి సరైన ప్రాధాన్యత ఇస్తామని చెప్పినా అది జరగదనే విమర్శ ఉండేది. చిన్న చిన్న పదవుల్లో తప్ప కీలకమైన పదవుల్లో వారిని నియమించడం అంత ఈజీ కాదని కూడా అంటుంటారు. ఇది ఒకప్పటి మాటని... బీజేపీలో ఆ విషయంలో మార్పు వచ్చిందని చెబుతున్నారు. అమిత్‌షా, మోదీ హయాంలో అలాంటి విమర్శలకు ఆస్కారం లేదని పరిణామాలు చూస్తే అర్థమవుతోంది. ఏ పార్టీ నుంచి వచ్చినా... రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పకనే చెబుతూ వచ్చారు. ఇప్పుడు మరోసారి రుజువు చేశారు. ఆర్ఎస్ఎస్ చెప్పిన సలహాలను రాజకీయంగా కలిసి వస్తాయే పాటిస్తామన లేకుంటే వాటిని పట్టించుకోబోమని కూడా తేల్చేస్తోంది మోదీషా ద్వయం. అందుకే బండి సంజయ్‌ను మార్చొద్దని ఆర్ఎస్ఎస్ నుంచి ఒత్తిడి వచ్చినా పట్టించుకోలేదు. ఆయన్ని తప్పించి కిషన్ రెడ్డికి తెలంగాణ బీజేపీ పగ్గాలు అప్పగించారు. అంతే కాదు తెలంగాణలో కీలకమైన నేతగా ఉన్న ఈటల రాజేందర్‌కు ముఖ్యమైన పదవి కట్టబెట్టారు. ఎన్నికల సంఘ నిర్వహణ అధ్యక్షుడిని చేశారు. మొదటి నుంచి పార్టీలో లేకపోయినా... ఈటలకు కీలకమైన బాధ్యతలు అప్పగించారు. మొదటి నుంచి కేసీఆర్, బీఆర్ఎస్‌తో నడిచిన ఈటల 2021లో నాటకీయ పరిణామాల మధ్య బయటకు వచ్చారు. 2021 జూన్‌లో బీజేపీలో చేరారు. ఒకానొక దశలో బీజేపీ అధ్యక్ష పదవి కూడా పోటీ పడ్డారు. కానీ అధినాయకత్వ ఎన్నికల నిర్వహణ బాధ్యత అప్పగించింది. ఏపీ విషయంలో కూడా అదే సీన్ రిపీట్ అయింది. కొత్త అధ్యక్షురాలిగా నియమితులైన దగ్గుబాటి పురందేశ్వరి అనూహ్యంగా బీజేపీలో 2014లో చేరారు. ఎన్టీఆర్ కుమార్తెగా రాజకీయ రంగప్రవేశం చేసిన ఆమె... తర్వాత తన టాలెంట్‌తో తనకంటూ జాతీయస్థాయిలో ఇమేజ్ బిల్డ్ చేసుకున్నారు. ఇప్పుడు బీజేపీ ఏపీ అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకోనున్నారు. ఈమె రాజకీయ ప్రవేశం కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి మొదలైంది. రాష్ట్రవిభజన తర్వాత కాషాయం కండువా కప్పుకున్నారు. ఈమెకు కూడా ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ లేదు. అయినా అధ్యక్షు రాలయ్యారు. ఉమ్మడి రాష్ట్రానికి ఆఖరి సీఎంగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఈ మధ్య కాలంలోనే బీజేపీలో చేరారు. ఈయన పొలిటికల్ కెరీర్ కూడా కాంగ్రెస్‌లోనే మొదలైంది. సమైక్యాంధ్రకు ఆఖరి సీఎంగా ఉంటూ విభజన అంశంలో అధినాయకత్వాన్ని ధిక్కరించిన నేతగా పేరుపొందారు. తర్వాత సమైక్యాంధ్ర పేరుతో ప్రత్యేక పార్టీ పెట్టి ఓడిపోయిన ఆయన మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. అయినా చాలా ఇన్‌యాక్టివ్‌గా ఉంటూ వచ్చారు. ఓ ఫైన్ మార్నింగ్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పేసి కాషాయం గూటికి చేరారు. అప్పటి నుంచి పొలిటికల్‌గా యాక్టివ్ అయ్యారు. ఆయనకు జాతీయ కార్యవర్గంలో పదవి ఇచ్చింది బీజేపీ. బాబూలాల్ మారండి.. ఈయన జార్ఖండ్ తొలి ముఖ్య మంత్రిగా పనిచేశారు. అప్పట్లో బీజేపీలో ఉండేవాళ్లు. తర్వాత జార్ఖండ్ వికాస్ మోర్చా పేరుతో ఓ పార్టీ పెట్టి విజయం సాధించడంలో విఫలమయ్యారు. దీన్ని 2020లో బీజేపీలో కలిపేశారు. ఇప్పుడు ఆయన్ని అధ్యక్షుడిని చేస్తూ బీజేపీ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆయన జార్ఖండ్‌లో ప్రతిపక్ష నేతగా కూడా ఉన్నారు. పంజాబ్ బీజేపీ అధ్యక్షుడిగా అయిన సునీల్‌కుమార్ జఖర్ కూడా కాంగ్రెస్ వ్యక్తే. గతేడాదే ఆయన బీజేపీలో చేరారు. గతంలో ఈయన పంజాబ్ పీసీసీ చీఫ్‌గా కూడా పని చేశారు. ఈయన కూడా 2020లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇలా వివిధ పార్టీల నుంచి వచ్చిన వారిని, బీజేపీని వీడి మరోసారి బీజేపీలోకి వచ్చిన వారికి మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

## కొత్తగా మరో 8 మెడికల్ కాలేజీలు

హైదరాబాద్ – ప్రభాతసూర్యుడు : రాష్ట్రంలో కొత్తగా 8 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందు కొచ్చింది. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇప్పటికే తెలంగాణలో 26 వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభిస్తుండగా.. తాజాగా మరో 8 మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 34కు చేరబోతోంది. తాజా ఆదేశాలతో రాష్ట్రంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 10 వేలకు చేరింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికి రాష్ట్రంలో కేవలం 5 మెడికల్ కాలేజీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య



కోరుట్ల – ప్రభాత సూర్యుడు : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దివంగత భారత ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య- అనిల్ అన్నారు.. గురువారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అన్నం లావణ్య,తోపాటు దళిత సంఘం నేతలు, ప్రముఖులు, కౌన్సిలర్లు పట్టణంలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా భారత ఉప ప్రధానమంత్రిగా దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆహర్నిషలు కృషి చేశారన్నారు .నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు.ఆనంతరం తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, బాబు జగ్జీవన్ రామ్ మెమోరియల్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడుపేట భాస్కర్ మాట్లాడుతూ దేశంలో బడుగు బలహీన వర్గాలు, శ్రమజీవులు, కార్మికుల పక్షన అనేక సంస్కరణలకు అద్యుడుగా నిలిచిన బాబు జగ్జీవన్ రామ్ కు గౌరవంగా పట్టణంలో తన పెరిట పాలక పక్షం ఏర్పాటు చేస్తున్న జగ్జీవన్రామ్ పార్క్ పనులను వచ్చే జయంతోత్సవాలకైన సిద్దం చేయాలని మున్సిపల్ పాలక పక్షాన్ని కోరారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్నం అనీల్, పద్మశాలి కులొన్నతి సంఘం జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీ నారాయణ, బలిజ పద్మ- రాజరెడ్డి, ఎండి సాబీర్,మాడవేణి నరేష్, సజ్జు, పెర్ల సత్యం, అడేపు మధు, అంబేద్కర్ సంఘాల నాయకులు చిట్యాల కరుణాకర్, చిట్యాల లచ్చయ్య,చెట్పల్లి లక్ష్మణ్, బలవంతుల సురేష్, బెక్కెం అశోక్, తెడ్డు రాజం,ఉయ్యాల నర్సయ్య, శోభన్ బాబు, బంగారు ప్రమేద్, మగ్గిడి వెంకట్, కృష్ణంరాజు, దశరథం, ప్రశాంత్, అల్లం రాజమౌళి,జర్నలిస్ట్ నేతలు నవాబ్ ఆలీ,ముఖ్రమ్ బేగ్,బానాల శ్రీధర్,పండిత్ శంకర్, మున్సిపల్ మేనేజర్ చిట్యాల శ్రీనివాస్, సానిటర్ ఇన్స్పెక్టర్ గజానంద్, రమేష్ తోపాటు వివిధ పార్టీల నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### బిఆర్‌యస్, బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక

# విధానాలను ప్రజల్లో తీసుకుపోవాలి





పటాన్‌చెరు– ప్రభాత సూర్యుడు
పటాన్‌చెరు నుండి గురువారం రాష్ట్ర రిజర్వ్ ఎస్సీ, ఎస్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీల సమావేశానికి హాజరయ్యామని సంగా రెడ్డి జిల్లా ఐఎన్‌టియుసి అధ్యక్షులు జహీరాబాద్ ఎల్ డి ఎం ఇన్‌చార్జీ కోల్కురి నర్సింహ రెడ్డి తెలిపారు. గురువారం గాంధీ భవన్ హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశానికి ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ సెల్ ఇన్‌చార్జీ కన్వీనర్ కొప్పుల రాజు, తెలంగాణ పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఐఏఎస్ సెంథిల్, సంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతున్నది కావున అందురు కష్టపడాలన్నారు. బిఅర్‌యస్, బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో తీసుకు పోవాలన్నారు. ఎల్‌డిఎం నాయకులు సంతోష్, అలాగే వివిధ జిల్లాల డిసిసి అధ్యక్షులు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కర్ణాటకలో టమాటా చోరీ



బెంగళూరు-ప్రభాత సూర్యుడు: దేశవ్యాప్తంగా టమాటా ధరలు రాకెట్‌లా దూసుకుపో తు న్నాయి. ఎప్పుడూ ఊహించనంతగా కిలో రూ. 150కి పైగానే పలుకుతోంది. మిగతా కూరగాయల ధరలూ అంతే ఉన్నా...టమాటా ఆ లిస్ట్‌లో టాప్‌లో ఉంది. అంత రేట్ పెట్టి కొనాలంటే జనాలు ఉసూరుమం టున్నారు. తప్పక కొను గోలు చేస్తున్నారు. కొంత మంది మాత్రం ఇదే అదనుగా చేతి వాటం చూపిస్తున్నారు. కర్ణాటకలోని హసన్ జిల్లాలో ఓ మహిళా రైతు టమాటా పండించింది. ధరలు పెరగడం వల్ల మంచి ఆదాయం వస్తుందని సంబర పడింది. పంటకోసి మార్కెట్‌కి తీసుకెళ్దామని చూసే లోపు ఒక్క కాయ కూడా కనిపించలేదు. అంతా దొంగల పాలైంది. దాదాపు రూ. 2.5 లక్షల విలువైన టమాటాలను ఎత్తుకెళ్లారు దుండగులు. టమాటా సాగు చేసేందుకు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నానని, వాటిని ఎలా కట్టాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది బాధితురాలు. "పంట సాగు కోసం చాలా ఖర్చు చేశాం. లోన్‌లు తీసుకొచ్చాం. పంట దిగుబడి బాగుంది. ధరలూ పెరిగాయి. కానీ పొలంలో దొంగలు పడ్డారు. 50-60 బ్యాగుల టమాటాలు తీసుకెళ్లడమే కాకుండా పక్కనున్న పంటనూ నాశనం చేశారు"2 ఎకరాల్లో పంట సాగు చేసింది మహిళా రైతు. సరిగ్గా పంట కోతకు వచ్చే సమయానికే ఒక్క కాయ కూడా లేకుండా దొంగలు అంతా ఊడ్చేశారు. బెంగళూరులో టమాటా కిలో ధర రూ. 120గా ఉంది. ప్రస్తుతానికి పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు, ఆ దొంగల్ని పట్టుకోవాలని రిక్వెస్ట్ చేస్తోంది. కర్ణాటకలోనే కాదు. తెలంగాణలోనూ ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లోని మార్కెట్‌లో టమాటాతో పాటు పచ్చిమిర్చి బాక్సులు చోరీకి గురయ్యాయి. అక్కడే ఉన్న సీసీటీవీని పరిశీలించిన పోలీసులు దొంగతనం జరిగిందని వెల్లడించారు. గత కొంత కాలంగా టమాటా ధర రోజురోజుకూ పెరిగిపోతుంది. దేశంలోని అనేక రాష్ట్రాల్లో కూరగాయలు ధరలు విపరీతంగా పెరగడంతో.. సామాన్య ప్రజలు కన్నీళ్లు పెడుతున్నారు. రోజూ ఏం వండుకోవాలో తెలియకు.. కారం మెతుకులతోనే పూట గడిపేస్తున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

వర్షాల కారణంగా రవాణాకు తీవ్ర అంతరాయం కల్గడంతో మెట్రో నగరాల్లో టమాటా ధరలు మరింత అధికం అయ్యాయి. కోల్ కతాలో కిలో టమాటా ధర రూ. 155కు చేరగా.. ముంబయిలో రూ. 58, ఢిల్లీలో రూ. 110, చెన్నైలో రూ. 117గా టమాటా ధరలు ఉన్నాయి. కేంద్ర వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం దేశంలో టమాటా సరాసరి ధర కిలోకు రూ. 83.29గా ఉంది. బీహార్ రాజధాని పాట్నాలో క్యాలీఫ్లవర్, క్యాబేజీ వంటి కూరగాయలు కిలో రూ. 60 చొప్పున లభిస్తున్నాయి. ఇదొక్కటే కాదు పశ్చిమ బెంగాల్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కూడా కూరగాయల ధరల విపరీతంగా పెరిగాయి.

## సింగరేణి ఉద్యోగులపిల్లలుకు సీట్లు

హైదరాబాద్– ప్రభాత సూర్యుడు: తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సింగరేణిలో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు రామగుండ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై తెలంగాణ ప్రభుత్వం గురువారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రామగుండం మెడికల్ కాలేజీలో మొత్తం 150 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. అయితే వీటిలో 23 సీట్లు ఆల్ ఇండియా కోటాలోకి వెళ్తాయి. మిగతా 127 సీట్లలో 5 శాతం రిజర్వేషన్ ప్రకారం సింగరేణి ఉద్యోగులకు కేటాయిస్తారు. ఈ లెక్కన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 127 సీట్లలో 7 సీట్లను కేటాయించారు. సింగరేణి ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో సింగరేణి ఉద్యోగుల పిల్లలలకు ఎంబీబీఎస్ సీట్లలో రిజర్వేషన్ కల్పించారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంపై సింగరేణి ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఎంబీబీఎస్ సీట్లలో తమ పిల్లలకు రిజర్వేషన్ కల్పించడం సంతోషకరమని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సాధారణంగా ఎంబీబీఎస్ సీట్లను నీట్ మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారనే విషయం తెలిసిందే. ఈ సీట్ల భర్తీ విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుంటారు.

## సీఏ ఫలితాల్లోనూ తెలుగోళ్లే

హైదరాబాద్– ప్రభాత సూర్యుడు: సీఏ ఇంటర్మీడియట్ ఫలితాల్లో హైదరాబాద్‌కు చెందిన వై.గోకుల్ సాయి శ్రీకర్ జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. శ్రీకర్ తండ్రి మారుతీకుమార్ సొంతూరు ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల. బ్యాంకు ఉద్యోగరీత్యా హైదరా బాద్ నిజాంపేటలో స్థిరపడ్డారు. నగరంలోనే ఇంటర్ ఎంఈసీ చదివిన శ్రీకర్ సీఏ కోచింగ్ తీసుకున్నాడు. మూడు స్థాయులను పూర్తి చేస్తేనే సీఏ పట్టా పొందుతారు. అందులో మధ్యస్థాయి అయిన సీఏ ఇంటర్‌లో 800 మార్కులకు 688 సాధించి తొలి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. శ్రీకర్ మొదటి ప్రయత్నంలోనే సీఏ ఇంటర్‌లో గ్రూపు-1, 2 రాసి... మొదటి ర్యాంకు సాధించడం విశేషం. మళ్లీ రెండున్నరేళ్ల తర్వాత సీఏ చివరి పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఫైనాన్స్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే తన లక్ష్యమని శ్రీకర్ వెల్లడించారు. సీఏ ఇంటర్, ఫైనల్ పరీక్ష ఫలితాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) జులై 5న విడుదల చేసిన సంగతి తెలిసిందే. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందు బాటులో ఉంచింది. విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్‌లను ఎంటర్ చేయడం ద్వారా స్కోరు కార్డులు, మెరిట్ జాబితాలను పొందొచ్చు. సీఏ ఫైనల్ పరీక్షలో అహ్మదాబాద్‌కు చెందిన అక్షయ్ రమేశ్ జైన్ 616/800 మార్కులు సాధించగా.. కల్పేశ్ జైన్ జి 603/800; ప్రఖార్ వర్షిణి 574/800 మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఇకపోతే సీఏ ఇంటర్‌లో వై. గోకుల్ సాయి శ్రీకర్; నూర్ సింగ్లా, కావ్య సందీప్ కొఠారీలు టాపర్లుగా నిలిచి సత్తా చాటారు. ఇంటర్మీడియట్ కోర్సులో గ్రూపు-1 పరీక్షలు మే 3, 6, 8, 10 తేదీల్లో; గ్రూపు-2ను 12, 14, 16, 18 తేదీల్లో ఎఐంఎ నిర్వహించింది. అలాగే, ఫైనల్ విద్యార్థులకు గ్రూపు-1ను మే 2, 4, 7, 9 తేదీల్లో, గ్రూపు-2ను మే 11, 13, 15, 17 తేదీల్లో పరీక్ష నిర్వహించిన ఐసీఏఐ తాజాగా ఫలితాలను ప్రకటించింది. సీఏ ఇంటర్ గ్రూపు-1 పరీక్షకు 1,00,781 మంది హాజరు కాగా.. వారిలో 19,103 మంది(18.95%) పాసయ్యారు. గ్రూపు-2లో 81,956 మందికిగాను 19,208 మంది(23.44%) ఉత్తీర్ణత సాధించారు.

### శ్యాం ప్రసాద్ ముఖర్జీ
## ఆశయాలు యువత ఆదర్శం



**కోరుట్ల –ప్రభాత సూర్యుడు :** జన సంఘ్ వ్యవస్థాపకులు, భారత తొలి పరిశ్రమక శాఖ మంత్రి, హిందూ మహాసభ పూర్వ అధ్యక్షుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు బుధవారంపట్టణంలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్, పట్టణ అధ్యక్షులు దాసరి రాజశేఖర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జాతీయ భావజాలంతో జాతీయ సమైక్యత కోసం ఎంతగానో కృషి చేశారని, 370 ఆర్టికల్ రద్దు కోసం ఆయన ఎంతో గాను తపన చెందారని పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడే అప్పటి ప్రధాని నేహ్రా జాతి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తన మంత్రి పదవి త్యజించి, జన సంఘ్ ని స్థాపించారని గుర్తు చేశారు.

## విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులుగా అరుణ్



**జగిత్యాల – ప్రభాత సూర్యుడు :** విశ్వహిందూ పరిషత్ జగిత్యాల పట్టణ అధ్యక్షులుగా జిట్టవేని అరుణ్ కుమార్ ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన గురువారం జరిగినవిశ్వహిందూ పరిషత్ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పద్మాకర్ నూతన నియామకాలకు చేపట్టారు.ఈ సందర్భంగా వి.హెచ్.పి జగిత్యాల పట్టణ అధ్యక్షులుగా జిట్టవేని అరుణ్ కుమార్, నగర కార్యదర్శిగా గణపతి నరేందర్ రాజులను నియమించారు. తమ నియామకాలకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మామిడాల రాములు, నగర ఉపాధ్యక్షులు ముస్కరి ప్రశాంత్ గాజోజు సంతోష్ తోపాటు పలువురు ఉన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులకు పోలీస్ భద్రత పథకం చెక్కులు అందజేత



**జగిత్యాల – ప్రభాత సూర్యుడు :** ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన కానిస్టేబుల్ వెంకట రమణ చారి 2022 నవంబర్ 17 న జరిగిన రోడ్డు ప్రమాద సంఘటనలో మృతి చెందారు.కాగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ వెంకట రమణాచారి కుటుంబానికి జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ భద్రత పథకం కింద మంజూరైన 16,00,000 రూపాయల భద్రత కు సంబంధించిన ముడు చెక్కు లను వెంకట రమణాచారి భార్యకు అందజేశారు.వెంకట రమణాచారి కుటుంబానికి పోలీస్ శాఖ తరుపున పూర్తి సహకారం అందిస్తూ వారికి భరోసా కల్పిస్తామ్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అమర్నాథ్,తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ రిచెస్ట్ బిచ్చగాడిగా ముంబై వ్యక్తి

- రోజూ భిక్షాటన చేస్తూ రోజుకు రూ.2,000కు పైనే సంపాదన
- కార్పొరేట్ పాఠశాలల్లో పిల్లల చదువు .. ఓ డూప్లెక్స్ ఇంట్లో నివాసం
- ప్రస్తుతం అతని ఆస్తి విలువు రూ.7.5 కోట్ల వరకు



**ముంబై – ప్రభాత సూర్యుడు :** రోడ్డు పక్కన, సిగ్నల్స్, బస్టాండ్, రైల్వే స్టేషన్స్, ఆలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ చాలా మంది జీవనం నెట్టుకొస్తున్నారు. వారిని చూసిన కొందరు జాలితో కొంత చిల్లర దానం చేస్తుంటారు. అలా బిచ్చమెత్తుకుంటూ జీవిస్తున్న వారిలో కూడా కొందరు కోటీశ్వరులు ఉంటారని మీరు ఎప్పుడైనా ఊహించారా..? లేదు కదా. అయితే మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి మాత్రం బిచ్చమెత్తుకుంటూ కోట్లు కూడబెట్టాడు. ఇప్పుడు ఏకంగా ప్రపంచంలోనే అత్యంత సంపన్న బిచ్చగాడిగా నిలిచి వార్తల్లోకెక్కాడు. ఇంతకీ అతను ఎవరు..? అతని రోజూవారీ సంపాదన ఎంత..? ఎన్ని కోట్ల ఆస్తులు ఉన్నాయో తెలుసుకుంటే...మహారాష్ట్ర ముంబైకి చెందిన భరత్ జైన్ బిచ్చమెత్తుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబంలో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో తన చదువును మధ్యలోనే ఆపేశాడు. ఆ తర్వాత భిక్షాటన మొదలు పెట్టాడు. అలా ముంబై వీధుల్లో రోజూ యాచిస్తూ వచ్చిన డబ్బునంతా రూపాయి రూపాయి దాచుకున్నాడు. అలా రోజుకు వేలల్లో సంపాదిస్తూ రూ.కోట్ల ఆస్తులు కూడబెట్టాడు. తన పిల్లల్ని కార్పొరేట్ పాఠశాలల్లో చదవిస్తూ.. ఓ డూప్లెక్స్ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అంతేకాదు ముంబైలో పలు చోట్ల ఆస్తులను సైతం కొనుగోలు చేశాడు. దీనికి తోడు రియల్ ఎస్టేట్ లో కూడా పెట్టుబడులు పెట్టాడు. ఈ క్రమంలో రికార్డు స్థాయిలో ఆదాయన్ని అర్జిస్తూ ఏకంగా ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన బిచ్చగాడిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం అతని ఆస్తి విలువు రూ.7.5 కోట్ల వరకు ఉంటుందట. జైన్ కు ముంబైలో డబుల్ బెడ్ రూం ఫ్లాట్ ఉంది. దాని విలువ రూ.1.2 కోట్ల వరకు ఉంటుంది. ఇక ఠాణేలో రెండు షాపులు ఉన్నాయి. వీటి ద్వారా నెలకు రూ.30 నుంచి రూ.40 వేల వరకూ అద్దె రూపంలో ఆదాయం వస్తోంది. దాంతో పాటు రోజూ భిక్షాటన చేస్తూ రోజుకు రూ.2,000కు పైనే అర్జిస్తున్నాడు. అలా నెలకు రూ.60 వేల నుంచి రూ.75 వేల వరకూ సంపాదిస్తున్నాడట. మొత్తం అతని నెల ఆదాయం ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగుల జీతం కంటే ఎక్కువే మరి. ప్రస్తుతం అతను పరేల్ ప్రాంతంలో ఓ డూప్లెక్స్ ఇంట్లో భార్య, పిల్లలు, సోదరుడు, తండ్రితో కలిసి నివాసముంటున్నాడు.ఇంత సంపాదించినప్పటికీ ఇంకా అతను ఆ యాచక వృత్తిలోనే కొనసాగుతన్నాడు. కుటుంబ సభ్యులు ఆ పని మానేయమని ఎంత చెప్పినా వినట్లేదట. తనను ఇంతటివాన్ని చేసిన ఈ వృత్తిని వదిలేందుకు అతడికి ఇష్టం లేదని చెబుతున్నాడు.

# టమాటాలెత్తికెళ్ళిన గజదొంగలు

**మహబూబాబాద్ – ప్రభాత సూర్యుడు :**

డోర్నకల్‌ల్ మున్సిపల్ కేంద్రంలోని కూరగాయల మార్కెట్ లో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. ధర ఎక్కువ గల కురగాయలను దుండగులు దొంగిలించారు. మార్కెట్ లోని లక్ పతి అనే దుఖాన దారుడి షాప్ లో ఉన్నటువనీటి దర ఎక్కువ గల టమాట, పచ్చి మిర్చి,చిక్కుడు కాయలతో పాటు మరికొన్ని కురగాయలను ట్రాలీలో ఎత్తుకెళ్లారు. కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్న తరుణంలో ధర ఎక్కువ కూరగాయలను దొంగిలించడం మార్కెట్‌లో ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మహబూబాబాద్ జిల్లాలో గత కొంతకాలంగా జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.ఈసారి దొంగలు ఎలాంటి బంగారం, నగదు, వాహనాల లాంటివి కాకుండా టమాటాలను ఎత్తుకెళ్లి నట్లుగా కూరగాయల వ్యాపారులు ఆరోప స్తున్నారు.

కాగా ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణంగా దొంగలు విలువైన వస్తువులు చోరిచేస్తుండటం సర్వసాధారణం.. కానీ డోర్నకల్ లో అధిక ధర పలుకుతున్న టమాటా, పచ్చిమిర్చి, చామ గడ్డలపై దొంగల కళ్లు పడ్డాయి. డోర్నకల్ కూరగాయల మార్కెట్లోని పలు దుకాణాల్లో ఇటీవల కూరగాయలు చోరీకి గురవుతున్నాయి. గాంధీ సెంటర్లోని కూరగాయల మార్కెట్లో రాత్రి వేళల్లో దుకాణాలకు తాత్కాలిక నెట్ ఏర్పాటు చేస్తారు. మార్కెటు నైట్ వాచ్ మెన్ లేకపోవడం,సీసీ కెమెరాలు లేకపోవడం తో ఇటీవల కూరగాయల ధరలు కొండెక్కి టమాటా 150 రూ.లు పలుకుతుండగా రాత్రి వేళల్లో పలు దుకాణాల్లోని కూరగాయలు చోరీకి గురవుతున్నట్లు వ్యాపారులు గుర్తించారు. బుధవారం ఉదయం కూరగాయల వ్యాపారి లక్పతి తన దుకాణం తెరిచి చూడగా అధిక ధర పలుకుతున్న టమాటా, పచ్చిమిర్చి, చామగడ్డతోపాటు ఇతర కూరగాయలు చోరీ అయినట్టు గుర్తించి లబోదిబోమన్నాడు. ఈ ఘటన జిల్లాలో వైరల్ గా మారింది.

### సీనియర్ సిటీజన్స్ ఆధ్వర్యంలో
## ఆర్డీవో వినోద్ కుమార్‌కు సన్మానం



**కోరుట్ల – ప్రభాత సూర్యుడు :** మెట్ పల్లి ఆర్డీవో వినోద్ కుమార్ ఇటీవల ఆర్మూర్ కు బదిలీ అయిన సందర్భంగా తెలంగాణ అల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు..అనంతరం సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ రూపొందించిన వయోధికుల సంక్షేమ,రక్షణ చట్టం అవగాహన ప్రచార పోస్టర్ల ను,పిలుపు పుస్తకాలను ఆర్డీవో వినోద్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని అన్నారు.కోరుట్ల డివిజన్లో సీనియర్ సిటీజేన్స్ కేసుల్లో రాజీ అధికారులుగా ,అస్సోసియేషన్ ప్రతినిధులుగా పనిచేస్తున్న పబ్బా శివానందం,రాజ్ మోహన్,లక్ష్మి నారాయణ,రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడుగా సేవలను అందిస్తున్న హరి ఆశోక్ కుమార్ లను అభినందించారు.

కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు పబ్బా శివానందం మాట్లాడుతూ కోరుట్ల,మెట్ పల్లి డివిజన్ల లో ఆర్డీవో వినోద్ కుమార్ వృద్ధుల కేసుల్లో సత్వర పరిష్కారం చూపడంతో పాటు,డివిజన్ లో మొట్ట మొదటి ఆర్డీవో గా ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు పబ్బాశివానందం, కార్యదర్శి గంటేడి రాజ్ మోహన్,కోశాధికారి నల్ల లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షుడు ఎండి.సైఫోద్దిన్, సయ్యద్ సాబీత్ అలీ,ల్యాండ్ అక్విజిషన్ అధికారి పి.హన్మంత్ రెడ్డి,మెట్ పల్లి డివిజన్ సీనియర్ సిటీజన్స్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి, కార్యదర్శి సౌడాల కమలాకర్, సీనియర్ సిటీజన్స్, పెన్షనర్ల, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్ దార్శనికతతోనే
## రాష్ట్రములో మెడికల్ కాలేజీలు

**హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు :** జోగులాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో కొత్తగా తొమ్మిది మెడికల్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఐటీ పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ట్విట్టర్ వేదికగా గురువారం స్పందించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్రంలో 33 జిల్లాలు జిల్లాకు మెడికల్ ఉన్నట్లు అయ్యిందని తెలిపారు. అలాగే ప్రతి జిల్లాకు ఓ నర్సింగ్ కాలేజ్, 500 పడకల ఆసుపత్రి ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా ఇలా లేదని, ఏ ఒక్క రాష్ట్రం సైతం తెలంగాణకు దరిదాపుల్లో లేదని మంత్రి స్పష్టం చేశారు. ఇదంతా సీఎం కేసీఆర్ దార్శనికతతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రత్యర్థులు వచ్చే ఎన్నికల కోసం ప్రణాళికలు రచించడంలో నిమగ్నమై ఉంటే.. మన ముఖ్యమంత్రి మాత్రం రాబోయే తరానికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో బిజీగా ఉన్నారంటూ ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం చేరువవడంతో పాటు గ్రామీణ విద్యార్థులకు , వైద్య విద్య అందించేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీకి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేరింది. 2014నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో తెలంగాణలో 2,850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే.. ఇప్పుడా సంఖ్య 8,340 సీట్లకు చేరింది.

### చెరువు మత్తడి పేల్చివేత
## ఘటనలో పోలీస్ కేసు నమోదు

**పెద్దపల్లి – ప్రభాత సూర్యుడు :** ఓదెల మండలంలోని శా నగొండ గ్రామంలో లో చెరువు మత్తడిని ధ్వంసం చేసిన సంఘటనలో కేసునమోదుచేసినట్టు పొత్కపల్లి ఏ ఎస్ ఐ లక్ష్మిరాజం తెలిపారు. గతనెల 27న ఓదెల మండలం శానగొండలోని ఊర చెరువు మత్తడిని కొందరు గుర్తు తెలియని దుండగులు డిటోనేటర్లతో పేల్చివేశారు. ఇందుకోసం కంప్రెషర్ బండిని వాడినట్లు అను మానిస్తున్నారు.

మత్తడిని పేల్చివేసిన సంఘటనపై ఈనెల 4న ఎస్సారెస్పి సబ్డివిసన్ ఏ ఈ వెంకటశివరాజ్, శానగొండ ఎంపీటీసీ జీల తిరుపతి, సర్పంచ్ గుంటి సునీత శ్రీనివాస్ లు పోత్కపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏ ఎస్ ఐ లక్ష్మి రాజం తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLA-PURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICA-TION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com